

ఈపీఆర్ డిజిటలైజేషన్
సింగరేణి ఉద్యోగుల సమాచారం డిజిటలైజేషన్ చేసేందుకు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. అన్ని ఏరియాల్లోనూ ప్రక్రియ కొనసాగుతుండగా.. శ్రీరాంపూర్ ముందంజలో ఉంది. 8లో▸



విజృంభిస్తున్న జ్వరాలు
డెంగీ, చికున్‌గున్యా జ్వరాలు విజృంభిస్తున్నాయి. చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడుతోంది. ఆస్పత్రిలో ఆపరిశుభ్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0 /25.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఈపీఎఫ్ లబ్ధిదారుల అవగాహన శిబిరం
మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈ నెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందించేందుకు ఒక్కరోజు శిబిరాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాలో నిర్వహిస్తున్నామని, పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి మంచిర్యాలలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్సు హాల్‌లో, నిర్మల్‌లో ప్రిన్స్ హైస్కూల్, గాజుల్‌పేట, పాత ఎన్‌హెచ్7 రోడ్డులో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈడీఎల్ఐ పథకం, ఈడీఎల్ఐ అర్హత, లబ్ధిదారుల కేవైసీ, ఈపీఎఫ్‌వోపై అవగాహన సేవలు పొందవచ్చని తెలిపారు.

గూడెంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



వ్రతం ఆచరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణస్వామి వ్రతం నోముకున్నారు. అర్చకులు వారికి స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్
- సీఓఈలో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం వడ్డించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణతో కలిసి బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యంలో రాళ్లు వస్తున్నాయనే ఫిర్యాదు మేరకు తనిఖీ చేపట్టారు. మధ్యాహ్న భోజనానికి అరగంట ముందుగా వచ్చిన ఆయన నేరుగా స్టోర్ రూంకు వెళ్లి సామగ్రి పరిశీలించారు. బియ్యంలో రాళ్లు, మెరిగెలు ఎంతమేరకు ఉన్నాయోనేది చూశారు. వంటగదిలో ఆహార పదార్థాలు, పరిసరాల పరిశుభ్రతను గమనించారు. విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్, ఆర్డీవో భోజనం చేశారు. ఆ హారం రుచిగా, శుచిగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల వద్దకు వెళ్లి రోజువారీగా ఆహారంలో ఏవైనా రాళ్లు వస్తున్నాయా, నాణ్యతగా వడ్డిస్తున్నారా, మెనూ పాటిస్తున్నారా, సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు భోజనానికి ముందు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కునేలా చూడాలని, ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. రిజిష్టర్లు, రికార్డులు, తరగతి గదులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ సమీప గ్రామాల్లో అవగాహన
జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ సమీప గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో జువ్విగూడ, మల్యాల, అలీనగర్, దొంగపల్లి, గొండుగూడ గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు ఆదేశాల మేరకు డీఆర్వో తిరుపతి, సిబ్బంది శనివారం రాత్రి అలీనగర్, మల్యాల, ఆదివారం జువ్విగూడ గ్రామాల్లో అవగాహన కల్పించారు. రాత్రివేళల్లో అడవులకు వెళ్లకూడదని, పశువులకు కేటాయించిన బఫర్ ఏరియా స్థలంలోనే మేపాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గాయపడిన పశువులకు ప్రభుత్వ పశువైద్యాధికారి శ్వేత చికిత్స చేశారు.

యాప్ దారుణాలు

- అప్పు వసూళ్ల పేరిట నిర్వాహకుల జులుం
- ఫొటోలు పోర్న్‌సైట్‌లో పెడతామంటూ బెదిరింపులు
- వేధింపులు భరించలేక శ్రీరాంపూర్‌లో యువకుడి ఆత్మహత్య
- జిల్లాలో బయటకు రాని బాధితులు వందలాది మంది



యాప్ రుణాలకు బలైన కల్యాణి(ఫైల్), శ్రీకాంత్(ఫైల్)

మంచిర్యాలక్రైం: లోన్‌యాప్ నిర్వాహకుల ఆగడాలు రోజు రోజుకు శ్రుతి మించిపోతున్నాయి. రుణం తీసుకుని చెల్లించినా.. చెల్లించకున్నా బాధితులను వేధింపులకు గురి చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. రుణం ఇచ్చే సమయంలో సేకరించిన గుర్తింపు కార్డుపై ఉన్న ఫొటో, వాట్సాప్ డీపీ ఫొటోను మార్ఫింగ్ చేసి పోర్న్‌సైట్‌లో పెడతామని బెదిరించే స్థాయికి ఈ వ్యవహారం వెళ్లడం సర్వసాధారణమైంది. జిల్లాలో లోన్‌యాప్ దారుణాలకు బలవుతున్న వారి సంఖ్య పెరిగిపోతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెల 23న శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌కు చెందిన నమ్మ బాజీ శ్రీకాంత్(29) లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విషయం బయటపడి పరువుపోతుందనే భయంతో ఎవరికీ చెప్పుకోలేక నలిగిపోతున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులకు తెలిస్తే మొహం చూపించలేననే ఆవేదనతోనే శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

చెల్లించినా వేధింపులే..
జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన బొల్లు కళ్యాణి(30) మొబైల్ లోన్ యాప్ ద్వారా రూ.10వేలు రుణం తీసుకుంది. వడ్డీతో సహా చెల్లించింది. అయినా రుణం చెల్లించాలంటూ బెదిరించడంతో ఇంట్లో తెలిస్తే గొడవలు అవుతాయనే భయంతో మళ్లీ చెల్లించింది. ఇలా లోన్ యాప్ నిర్వాహకులు వేధిస్తూ వచ్చారు. మొత్తం చెల్లించానని లోన్ యాప్ నిర్వాహకులకు గట్టిగా చెప్పడంతో కళ్యాణి ఫొటోను మార్ఫింగ్ చేసి ఆమె వాట్సాప్‌కు పంపించి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె 2022 మే 18న ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా వడ్డీ వ్యాపారులు ఇళ్లకు వచ్చి గొడవ చేయడం చేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ రుణ సంస్థలు అంతకుమించి ఆగడాలకు పాల్పడుతుండడం గమనార్హం.

యువత లక్ష్యంగా వల
యువతను లక్ష్యంగా చేసుకుని లోన్‌యాప్ నిర్వాహకులు రుణం పేరిట వల విసురుతున్నారు. 25 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగిన వారిని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారికి మెస్సేజ్‌లు పంపిస్తూ ఆకర్శిస్తున్నారు. సాధారణంగా ఆన్‌లైన్‌లో ఎక్కువసేపు గడిపే వారికి లోన్ యాప్‌ల లింకులు వస్తుంటాయి. ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేకుండా రెండు నిమిషాల్లోనే రుణం తీసుకునే అవకాశం అంటూ ఆకర్శించే విధంగా ప్రకటనలు చేస్తారు. ఎవరైన అత్యవసరంగా డబ్బు అవసరం అనుకున్న వాళ్లు లింకు ఓపెన్ చేస్తే ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తారు. ఆ తర్వాత పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఫొటోలు పంపించాలని చెబుతారు. సెల్‌ఫోన్‌లో గూగుల్ డ్రైవ్‌కు లింక్ అయి ఉన్న అన్ని కాంటాక్టు ఫోన్ నంబర్లు తమకు చేరేలా చూసుకుంటారు. అనంతరం రూ.వెయ్యి నుంచి రూ.50వేల వరకు రుణం ఇస్తారు. తిరిగి చెల్లింపునకు వారం నుంచి నెల వరకు గడువు ఇస్తారు. ఆ తర్వాత చెల్లించకపోతే వేధింపులు ప్రారంభిస్తారు. అడిగినంత డబ్బు చెల్లించకపోతే అసభ్యకర పదజాలంతో దూషించడం మొదలు బాధితుల ఫోన్‌లో నంబర్లు ఉన్న వారందరికీ మెస్సేజ్‌లు పంపిస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తారు. డబ్బు చెల్లించకపోతే ఫొటోలు మార్ఫింగ్ చేసి అందరికీ వాట్సాప్‌లో షేర్ చేస్తామని బెదిరింపులకు గురి చేయడం గమనార్హం.

మధ్యతరగతి కుటుంబాలే అధికం..
ఎక్కువ శాతం లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు తీసుకునేది యువత, మధ్య తరగతి కుటుంబాల వారే ఉంటున్నారు. బయట ఎవరూ అప్పులు ఇవ్వకపోవడంతో తక్కువ మొత్తం కోసం యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి వారు మోసాలకు పాల్పడుతారని పోలీసులు లోన్‌యాప్ రుణాలు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా అవసరాల రీత్యా లోన్‌యాప్‌ల వలలో చిక్కుకుని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

నమ్మి మోసపోవద్దు..



ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని లోన్‌యాప్‌లను నమ్మి మోసపోవద్దు. ఎవరూ ఊరికనే డబ్బులు ఇవ్వరు. ఒకవేళ ఇచ్చారంటే దాని వెనుక ఏదో పెద్ద కుట్ర దాగి ఉంటుంది. నగదు లావాదేవీల విషయంలో రిజిష్టర్డ్ ఫైనాన్షియల్ సంస్థలనే ఆశ్రయించాలి. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ద్వారా లోన్లు ఇవ్వడం, కొన్ని బోగస్ సంస్థలు, లోన్‌యాప్‌ల సంస్థలు బాధ్యులను ప్రలోభాలకు గురిచేసి రుణం ఇచ్చాక వేధింపులు మొదలుపెడతారు. శ్రీరాంపూర్‌కు చెందిన శ్రీకాంత్ లోన్ యాప్‌ల ద్వారా రుణం తీసుకుని చెల్లించకపోవడంతో నిర్వాహకుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశాం. లోన్‌యాప్‌ల ద్వారా రుణం తీసుకొని వేధింపులకు గురైనవారు ఆత్మహత్య చేసుకోవద్దు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి.
– ఆర్.ప్రకాష్, ఏసీపీ, మంచిర్యాల

జ్వరాలపై 'సాక్షి' ఫోన్ ఇన్



డాక్టర్ అభినవ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రజలు వైరల్, డెంగీ, చికున్‌గున్యా జ్వరాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి డెంగీ జ్వరాలు కాని వాటిల్లో కూడా ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోయి ప్రాణాలమీదికి వస్తోంది. జ్వరం తగ్గిన కూడా బాధితులు నీరసించి పోతున్నారు. ఈ నేపథ్యంలో జ్వరాలపై సందేహాలు, వైద్య సలహాల కోసం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎండీ(జనరల్ ఫిజిషియన్) డాక్టర్ అభినవ్ సందేహాలను నివృత్తి చేస్తారు.

సమయం : మంగళవారం ఉదయం
11 నుంచి 12 గంటల వరకు
సెల్‌ఫోన్ నంబర్:
79938 26152

17టీఎంసీలకు చేరిన నీటిమట్టం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఉన్న ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం ఆదివారం 17 టీఎంసీలకు చేరింది. వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద, కడెం ప్రాజెక్టు వరద నీరు చేరుతుండడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 17.010 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 20 వేల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్ట్ నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 309 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

విద్యార్థులకు 'ఉపకారం'



తరగతి గదిలో విద్యార్థులు

- సెప్టెంబర్ 11వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు
- ప్రతీ ఏడాది ఎంపికైనవారు రెండంకెల్లోనే..
- అవగాహన కల్పిస్తే మేలు

మంచిర్యాలఅర్బన్: ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రతిభ కలిగిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. అలాంటి వారికి అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపకార వేతనాలు అందిస్తున్నా సరైన అవగాహన లేక అందుకోలేకపోతున్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి నేషనల్ మిన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) పథకం అమలు చేస్తోంది. ప్రతిభా పరీక్ష నిర్వహించి ఉపకార వేతనాలు అందిస్తోంది. రాత పరీక్ష విధానంలో విద్యార్థులను ఉపకార వేతనాలకు ఎంపిక చేస్తుండగా.. సరైన అవగాహన లేకపోవడంతో వేలాది మంది పొందలేకపోతున్నారు. గత నాలుగేళ్లగా విడుదలైన ఫలితాలు రెండంకెలు దాటకపోవడం గమనార్హం. ఈ ఏడాది ప్రతీ విద్యార్థి పరీక్ష రాసేలా పాఠశాలకు ఒక నోడల్ అధికారిని నియమించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. సెప్టెంబర్ 11వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు విధించారు.

అర్హులు ఎవరంటే..
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. వసతిగృహ సదుపాయం లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50లక్షలు మించరాదు. ఏడో తరగతిలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50శాతం, మిగతా వర్గాలకు చెందిన విద్యార్థులకు 55శాతం మార్కులు సాధించి ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లోనే 8వ తరగతి చదువుతున్న వారు అర్హులు.

ఎంపికయ్యాక..
అర్హత పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం చెల్లిస్తారు. నాలుగేళ్లపాటు రూ.48వేలు విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారు. పిల్లలు తమ దుస్తులు, ఇతరత్రా చదువుకు సంబంధించిన సామగ్రి కొనుగోలు చేయవచ్చు. చదువుకు ఆర్థిక ఇబ్బందులు రాకుండా దోహదపడుతుంది.

రెండంకెల్లోనే..
అర్హులైన విద్యార్థులు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. కానీ ఎంపిక అవుతున్న వారి సంఖ్య రెండంకెల్లోనే ఉంటోంది. గత ఆరేళ్లలో ఎంపికైన విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే వందలోపే ఉంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి దరఖాస్తు చేయించడంతోపాటు పరీక్షకు సన్నద్ధం చేసి ఎంపికయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

సంవత్సరం	పరీక్ష రాసినవారు	ఎంపికైన వారు
నవంబర్ 2018	1080	64
నవంబర్ 2019	1161	59
ఫిబ్రవరి 2021	473	56
మార్చి 2022	713	56
డిసెంబర్ 2023	752	53

దరఖాస్తులు ఇలా..
bsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేసి కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులకు చివరి తేదీ సెప్టెంబర్ 11. ఓసీ, ఓబీసీలకు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష రుసుం చెల్లించాలి. నకలు పత్రాలను ప్రధానోపాధ్యాయుల ద్వారా పరీక్ష రుసుం బ్యాంకులో డీడీ తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని దరఖాస్తును డీఈవో కార్యాలయంలో అందజేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి
విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. అర్హత పరీక్షల్లో మంచి ప్రతిభ చూపితే ఎంపికైన వారికి ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రతీ పాఠశాలలో నోడల్ అధికారిని నియమిస్తున్నాం. ఎక్కువ మందితో దరఖాస్తు చేయించి పరీక్షకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– డీఈవో యాదయ్య, మంచిర్యాల

కుండపోత వర్షం



రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు



రైల్వే క్వార్టర్స్‌లోకి చేరిన వరద నీరు



గ్యాస్ సిలిండర్‌ను తీసుకొస్తున్న యువకుడు

- బెల్లంపల్లిలో జనజీవనం అతలాకుతలం
- రైల్వేక్వార్టర్స్, ఇళ్లలోకి వరద నీరు
- నీటమునిగిన వస్తు సామగ్రి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో ఆదివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. కాల్‌టెక్స్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రైల్వేట్రాక్ –ప్రధాన రహదారి మధ్య ఉన్న రైల్వేక్వార్టర్స్, ఇళ్లలో వరద నీరు భారీ చేరడంతో జనజీవనం అతలాకుతలమైంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం, మూడో రైల్వేలైన్ పక్కన ఉన్న అడ్డుకట్ట భారీ వర్షానికి కొట్టుకుపోవడంతో నీటి ప్రవాహం అధికమైంది. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింది నుంచి వరద నీరు సాఫీగా వెళ్లడానికి వీల్లేకపోవడంతో మురికి నీరంతా ఒక్కచోట చేరి చెరువును తలపించింది. ఇళ్లు, క్వార్టర్స్‌లోకి నడుంలోతు మురికి నీరు చేరడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు, బట్టలు, మంచాలు, గ్యాస్‌సిలిండర్లు ఒక్కొక్కటి బయటకు తీసుకు రావడానికి యాతన పడ్డారు. కొందరు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించారు. బియ్యం, ఇతర వస్తువులు నీటిపాలు కాగా కొందరు కట్టుబట్టలతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. మధ్యాహ్నం అరగంటపాటు కురిసిన వర్షం ఆ ప్రాంత ప్రజలను నిరాశ్రయులను చేసింది.

రోడ్డుపై వరద నీరు
రైల్వేఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో బ్రిడ్జి కింది నుంచి వరద నీరు అవతలి వైపు వెళ్లేలా మురికి నీటి కాలువ నిర్మించారు. కానీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో రాళ్లు, పిచ్చిమొక్కలతో నిండి నీరు నిలవడంతో సమస్యగా మారింది. మరోవైపు మూడో రైల్వేట్రాక్ పనులతో కాంట్రాక్టర్ నిర్మించిన తాత్కాలిక అడ్డుకట్ట తెగిపోయి వరద నీరు పోటెత్తినట్లు తెలుస్తోంది. బయటకు వెళ్లే మార్గం లేక ఫ్లైఓవర్ బ్రిడ్జి చివర రోడ్డు పై నుంచి మురికి నీరు పరవళ్లు తొక్కింది. బెల్లంపల్లి నుంచి మంచిర్యాలకు, మంచిర్యాల వైపు నుంచి బెల్లంపల్లికి వచ్చే వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. సర్వీసు రోడ్డంతా వరద నీటితో నిండి పోయింది. కాగా, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత జేసీబీని తెప్పించి కాలువలో నుంచి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో ఉపశమనం కలిగించింది.

సా..గుతున్న పవర్ ప్లాంటు మరమ్మతు

- నిలిచిన విద్యుత్ ఉత్పత్తి
- మూడు నెలలుగా పనులు



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)లో మూడు నెలలుగా మరమ్మతు పనులు సా..గుతున్నాయి. రెండో యూనిట్(600 మెగావాట్లు) ప్లాంటులో జూన్ 15న విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు చేపడుతున్నారు. నిర్ణీత గడువు ముగిసినా మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో 70రోజులకు పైగా యూనిట్–2లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. గత ఏడాది యూనిట్–1లో క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు చేపట్టగా.. 45రోజుల్లోనే పూర్తి చేశారు. యూనిట్–2 టర్బయిన్‌లో సమస్యలు ఎదురుకావడంతో మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోంది. 1200 మెగావాట్ల ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలను పవర్‌మేక్ కంపెనీ చేపడుతున్న విషయం తెలిసిందే. యూనిట్–2 ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి చేపట్టి 50వేల గంటలు పూర్తి చేసుకోగా.. క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు చేపట్టారు. బాయిలర్ టర్బయిన్‌తోపాటు బీవోపీలో అన్ని రకాల మోటార్లు, యంత్రాలు, ఫ్లయాష్, సీహెచ్‌పీ, కూలింగ్ టవర్లతోపాటు విద్యుత్ ఉత్పత్తికి ప్రధానమైన టర్బయిన్ ఓపెన్ చేసి మరమ్మతు పనులు చేపట్టారు. రూటర్ సమస్య ఎదురు కాగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌కు తరలించి మరమ్మతు చేయిస్తున్నారు. అక్కడి నుంచి రూటర్‌ను తీసుకొచ్చి యధాస్థితిలో అమర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంకో వారం రోజుల్లో రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

ఏకీకృత సర్వీసులతో పదోన్నతి కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: ఏకీకృత సర్వీసులు రూపొందించి అన్ని రకాల పదోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మంచిర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో టీచర్ల ఫ్రెండ్లీ ఉండబోతుందని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్నా ఐదు డీఏలు విడుదల, సీపీఎస్ రద్దు, కొత్త పీఆర్‌సీ ప్రకటించడం, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీలోని బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైంస్కేల్ కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్‌రావు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: జైపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో నిర్వహించిన పోటీల్లో అండర్–14, 17 బాలబాలికల విభాగంలో జోనల్ స్థాయికి ఎంపికైన జట్టు వివరాలను ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫణిరాజా ఆదివారం ప్రకటించారు. అండర్–14 బాలుర విభాగంలో అల్ఫోర్స్ పాఠశాల మంచిర్యాలకు చెందిన సుప్రతిక్‌వర్మ, సాయిరితోష్, అల్ఫోర్స్ పాఠశాల మందమర్రికి చెందిన నివాస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెల్లంపల్లికి చెందిన రుత్విక్ తేజ, ఆంజనేయప్రసాద్, అండర్–14 బాలికల విభాగంలో సత్యచతుర్వేదీ ఎంపికయ్యారు. అండర్ –17 బాలుర విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెల్లంపల్లికి చెందిన శివప్రసాద్, వంశీరాజ్, సాయి సుశీల్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జైపూర్‌కు చెందిన సంజయ్, లిటిల్ ఫ్లవర్ పాఠశాల మందమర్రికి చెందిన కిరణ్ ఎంపికయ్యారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సోగాల శ్రీనివాస్ (47) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ శనివారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. తల తిప్పినట్టవుతుందని.. కాసేపు పడుకుంటానని భార్య, కూతురుతో చెప్పాడు. కూలర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చుట్టుపక్కల వారిసాయంతో ఆటోలో మేదరిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తీసుకెళ్లగా, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన పాడేటి పోశగౌడ్‌పై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశగౌడ్‌కు కొన్ని నెలల క్రితం పక్షవాతం రావడంతో ఒక చేయి, కాలు పని చేయడంలేదు. దీంతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి వెనుక పెరట్లోకి మూత్ర విసర్జనకు వెళ్లగా అక్కడే ఉన్న కోతులు దాడి చేసి కొరికి గాయపరిచాయి. పోశగౌడ్ ఎడమ భుజానికి, చేయికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే అతడిని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా వైద్యులు సూచించారు. కోతుల నుంచి తమను రక్షించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

మహిళ ఆత్మహత్య

తాండూర్: భర్తతో వచ్చిన మనస్పర్థల కారణంగా ఒంటరిగా జీవిస్తున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన పసులోటి మీనా (27), పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన నరేశ్ 2016లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, పాప జన్మించారు. పిల్లలు పుట్టాక భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో మీనా పిల్లలను భర్త వద్ద వదిలేసి తంగళ్లపల్లిలోని తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. పిల్లలు, భర్తకు దూరమై ఒంటరిగా ఉంటూ మానసిక వేదనకు గురైంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మనస్తాపంతోఇంట్లో ఉన్న సూపర్‌వాస్మోల్ తాగి అపస్మారక స్థితికి చేరింది. వెంటనే ఆమెను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మీనా తల్లి కమలాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈపీఆర్ డిజిటలైజేషన్

- సింగరేణిలో ప్రత్యేక పోర్టల్
- ఉద్యోగుల సమస్త సమాచారం కంప్యూటర్‌లో నిక్షిప్తం
- అన్ని ఏరియాల్లోనూ ప్రక్రియ
- ముందంజలో శ్రీరాంపూర్

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగుల సమస్త సమాచారం తెలుసుకోవడం ఇక సులువైంది. ఇన్నాళ్లు ఉద్యోగులకు తమ పర్సనల్ రికార్డు (ఈపీఆర్)లో ఏ వివరాలున్నాయో తెలుసుకునేందుకు చాలా ప్రయాస పడాల్సి వచ్చేది. అధికారుల చుట్టూ తిరిగి రికార్డులు తీయించి తెలుసుకునే అవసరముండేది. ఇప్పుడు ఈ ఇబ్బందులకు స్వస్తి పలుకుతూ కంపెనీ ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. నేరుగా ఉద్యోగులు కంపెనీ వెబ్‌సైట్‌లోని ఉద్యోగి పర్సనల్ రికార్డ్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో లాగిన్‌ై వారే తెలుసుకోవచ్చు. ఒక్క క్లిక్‌తో వారి సమస్త సమాచారం తెరపై చూసుకోవచ్చు. ఇప్పటివరకు అధికారులకు మాత్రమే ఉన్న ఈ సదుపాయం ఇప్పుడు ఉద్యోగులకు కూడా లభించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పేపర్ రికార్డుల్లో ఉన్న వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను కొద్దిరోజులుగా కంపెనీ వ్యాప్తంగా 11 ఏరియాల్లో ప్రారంభించారు. అన్ని ఏరియాల్లో కంటే శ్రీరాంపూర్ ఏరియాలోని అధికారులు రెండురోజుల క్రితమే ఈ ప్రక్రియను వందశాతం పూర్తి చేసి ముందు వరుసలో ఉన్నారు. మందమర్రి, బెల్లంపల్లిలోనూ ఈ ప్రక్రియ దగ్గరపడింది. శ్రీరాంపూర్ ఏరియాలో 8,934 మంది ఉద్యోగులుండగా, వీరందరి వివరాలు ఇప్పుడు పోర్టల్‌లో నిక్షిప్తమయ్యాయి.

ఎంప్లాయ్ కోడ్ ఎంట్రీ చేస్తే చాలు

ఈ సేవలను వినియోగించుకోవడం కోసం ఉద్యోగి ముందుగా పోర్టల్‌లో తన ఎంప్లాయ్‌కోడ్‌ను ఎంట్రీ చేసి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కసారి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుంటే సరిపోతుంది. పాస్‌వర్డ్ ఎంట్రీ చేసిన తరువాత ఓటీపీ వస్తుంది. దీంతో లాగిన్ కావచ్చు. ఇలా ఇప్పుడు ఉద్యోగి తన పర్సనల్ రికార్డు వివరాలన్నీ తెలుసుకోవచ్చు.


శ్రీరాంపూర్‌లో ఉద్యోగుల వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

తప్పిన ఇబ్బందులు

ఉద్యోగి కుటుంబంలో ఎవరికైనా అత్యవసర ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఆస్పత్రి నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి రిఫరల్ చేయాల్సి వస్తే సదరు వ్యక్తి మూడు ఫొటోలు తీసుకుని వారు పని చేసే చోట కార్యాలయానికి వెళ్లి ఫారాల మీద అంటించి మేనేజర్‌తో వీరే అని ధ్రువీకరించి ఫారాలు తీసుకువస్తేనే రిఫరల్ అయ్యేది. ఆపత్కాలంలో ఇది పెద్ద ప్రయాసగా ఉండేది. ఇప్పుడు ఆ అవసరం ఏమాత్రం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. తన ప్రమోషన్ ఎప్పుడు వచ్చింది, సీఎంపీఎఫ్ వివరాలు, ఇంక్రిమెంట్లు, హెల్త్ ఇలా అన్ని వివరాలు అనుసంధానమై పోర్టల్‌లో ఉండటంతో ఇకవీటి కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. నెల జీతం చీటీ కూడా ఇందులోనే ఉంటుంది. ఇక సీఎంపీఎఫ్ చీటీలు, జీతం చీటీల పంపిణీ ఇకముందు ఉండదు.

ఉద్యోగి కుటుంబ సభ్యుల వివరాలు, పిల్లల విద్యార్హతలు, ఎప్పుడు ఉద్యోగంలో చేరింది, వచ్చిన ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, హెల్త్ రికార్డులు, పీఎం ఈ వివరాలు, సీఎంపీఎఫ్, నామిని వివరాలన్నీ ఉంటాయి. సంవత్సరాల హాజర్లు కూడా చెక్ చేసుకోవచ్చు. ఉద్యోగి కుటుంబ సభ్యుల ఫొటోలు కూడా అప్‌లోడ్ చేసి పెట్టారు. గతంలో ఇవన్నీ ఉద్యోగులు పని చేసే చోట వారి కార్యాలయాల్లో ఫైళ్ల రూపంలో ఉండేవి. ఇలా సుమారు 39 రకాల పత్రాలు రికార్డు ఫైళ్లలో ఉండేవి. గతంలో కొన్ని వివరాలు మాత్రమే సైట్‌లో అప్‌లోడ్ చేసి ఉండేవి. అవి కూడా కేవలం అధికారులకు మాత్రమే ఓపెన్ చేసే యాక్సెస్ ఉండేది. ఉద్యోగులు చూడటానికి వీలుండేది కాదు. ఇప్పుడు ఆ పేపర్లన్నీ డిజిటలైజేషన్ చేసి అప్‌లోడ్ చేసి పెట్టారు. పేపర్‌లెస్‌గా ఈపీఆర్ఐఎస్ రికార్డులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కంపెనీ ఈ చర్యలు చేపట్టింది. కొద్దిరోజుల క్రితమే ఈ పోర్టల్‌ను కంపెనీ సీఎండీ బలరాంనాయక్ దీన్ని ప్రారంభించారు. ఇప్పుడు ఉద్యోగులు నేరుగా పోర్టల్ ఓపెన్ చేసుకుని వివరాలు తెలుసుకోవచ్చు. ఉద్యోగి సెల్‌కు ఓటీపీ వచ్చే విధానం ఉండటంతో ఇతరులు ఓపెన్ చేసే అవకాశముండదు.

పారదర్శకత కోసమే..



అన్ని ఏరియాల కంటే ముందుగా శ్రీరాంపూర్ ఏరియాలో వందశాతం ఈపీఆర్ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు. ఉద్యోగులు ఇక సులువుగా వారి ఈపీఆర్ రికార్డులోని వివరాలను ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వీలుంది. ఉద్యోగి వివరాలన్నీ అన్ని పారదర్శకంగా ఉండాలనే కంపెనీ ఈ వెసులుబాటు కల్పించింది.

– బీ సంజీవరెడ్డి, జీఎం

కంపెనీ వార్షిక క్రీడా షెడ్యూల్ విడుదల

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా డిపార్ట్‌మెంటల్ వార్షిక క్రీడా షెడ్యూల్‌ను అధికారులు ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 28 నుంచి ప్రగతి మైదానంలో పోటీలు ప్రారంభమవుతాయి. ఆసక్తి గల క్రీడాకారులు 28న ఉదయం 8 గంటలకు శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా యాజమాన్యం సూచించింది. ఈ నెల 28న వాలీబాల్, 29న బాస్కెట్ బాల్, 30న ఫుట్‌బాల్, 31, సెప్టెంబర్ 1న క్రికెట్, సెప్టెంబర్ 1న షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, 2న హాకీ, 3న బల్ బ్యాడ్మింటన్, 4న కబడ్డీ, 5న లాన్‌టెన్నిస్, 6న అథ్లెటిక్స్, త్రోబాల్ (వుమెన్), స్విమ్మింగ్, 8న బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, కల్చరల్ పోటీలు నిర్వహించనున్నారు.

మెరుగైన సేవలందించాలి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.

భీమారం రిజర్వ్‌ఫారెస్ట్‌లో టేకుచెట్ల నరికివేత

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం రిజర్వ్ ఫారెస్ట్‌లో పదుల సంఖ్యలో టేకు చెట్లను శనివారం రాత్రి స్మగ్లర్లు నరికివేశారు. మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారికి సుమారు 200 మీటర్ల దూరంలోని టేకు వనంలోని విలువైన చెట్లు నరికి వాహనాల్లో తరలించారు. గత నెలలోనూ స్మగ్లర్లు అధికసంఖ్యలో టేకు చెట్లు నరికినా అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో స్మగ్లర్లు రెచ్చిపోయి విలువైన అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. భీమారం ప్రాంతంలో దాదాపు 60 ఏళ్ల క్రితం నాటిన టేకు ప్లాంటేషన్‌లో విలువైన చెట్లు ఉండటంతో స్మగ్లర్ల కన్ను పడింది. గతంలో గొడ్డళ్లతో నరికి స్మగ్లింగ్ చేయగా, శనివారం రాత్రి యంత్రాలు వాడి చెట్లను నేలకూల్చారు. అనంతరం దుంగలుగా మార్చి తరలించారు. రూ.లక్షల విలువచేసే టేకు చెట్లు నరికినా అటవీశాఖ అధికారులకు ఆదివారం సాయంత్రం వరకు సమాచారం లేదని మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. టేకుచెట్ల నరికివేతపై విచారణ చేపడతామని పేర్కొన్నారు. కాగా, భీమారం, ఎలకేశ్వరం బీట్ ఆఫీసర్లు సెలవుపై ఉండటంతో అడవిలో పెట్రోలింగ్ నిర్వహించడం ఇబ్బందిగా మారింది.


రిజర్వ్‌ఫారెస్ట్‌లో నరికివేతకు గురైన టేకుచెట్టు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


అల్లూరి శంకర్ (ఫైల్)

దహెగాం: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అల్లూరి శంకర్ (63) ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 18న మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామ సమీపంలో ఏనగూడ గ్రామానికి చెందిన ఎంగిలి రమేశ్, పోసాలు బైక్‌పై దహెగాం వైపు వస్తున్నారు. గిరవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ మరో బైక్‌పై దహెగాంకు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మర్రిపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఈ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎంగిలి రమేశ్, అల్లూరి అనిల్, అల్లూరి శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అల్లూరి శంకర్‌కు మంచిర్యాల, వరంగల్, మహారాష్ట్రలోని చంద్రాపూర్ ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించగా అక్కడి వైద్యులు ఇంటికి తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో శనివారం సాయంత్రం ఇంటికి తీసుకురాగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- విస్తరిస్తున్న డెంగీ, చికున్ గున్యా
- వేధిస్తున్న కీళ్లు, ఒళ్లు నొప్పులు
- అపరిశుభ్రంగా ఆస్పత్రి వార్డులు
- ఇబ్బందుల్లో జ్వర పీడితులు


మూత్రశాలలో పేరుకుపోయిన మురుగునీరు


చెన్నూర్ ఆస్పత్రి వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు

చెన్నూర్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులు చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి క్యూ కడుతున్నారు. కాగా, ఆస్పత్రిలో అపరిశుభ్రత కారణంగా జ్వరపీడితులు కొత్త వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. రూ.10 కోట్లతో ఆధునిక హంగులతో ఆస్పత్రి భవనం నిర్మించినా నిర్వహణ లోపంతో వార్డులు కంపుకొడుతున్నాయి. బాత్‌రూమ్‌లు శుభ్రం చేయకపోవడంతో వార్డుల్లోకి దుర్గంధం వ్యాపిస్తోంది. సిబ్బందికి, వైద్యులకు చెప్పినా పట్టించుకోవడంలేదని రోగులు చెబుతున్నారు. ఆస్పత్రిలో రోజుకు 300 నుంచి 350 మంది ఓపీ ఉంటుంది. సాధారణ వార్డులతో పాటు ఆరోగ్యశ్రీ వార్డుల్లో 40 నుంచి 50 మంది జ్వరాలతో చికిత్స పొందతున్నారు. వార్డులు కంపుకొడుతుండగా జ్వరంతో వచ్చిన తమకు మరో కొత్త రోగం అంటుకునేలా ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికున్ గున్యా, డెంగీ కేసులు

విషజ్వరాలు జనాలను పట్టి పీడిస్తున్నాయి. జ్వరాల బారిన పడితే ఒళ్లు నొప్పులతో పాటు కీళ్ల నొప్పులతో బాధితులు నరకం అనుభవిస్తున్నారు. ఎక్కువ మందికి డెంగీ, చికున్ గున్యా లక్షణాలున్నట్లు వైద్యులు తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, కోటపల్లి మండలాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. బాధితులు చికిత్స పొందుతున్నా వారంపాటు కీళ్లు, ఒళ్లు నొప్పులు పీడిస్తున్నాయి. విషజ్వరాలు రోజురోజుకూ విజృంభిస్తుండడంతో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. జ్వర పీడితులతో చెన్నూర్ సామాజిక ఆరోగ్యకేంద్రం కిటకిటలాడుతోంది.

దోమల కారణంగానే..

చెన్నూర్ మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, కోటపల్లి మండలాల్లో మొక్కుబడిగా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో నిన్న, మొన్నటి వరకు వైరల్ ఫీవర్లతో జనం మంచం పట్టగా ప్రస్తుతం చికున్ గున్యా విజృంభిస్తున్నట్లు చెబుతున్నారు. చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. చెన్నూర్ మండలంలోని అస్నాద, పొక్కూర్, గంగారం, కాచన్‌పల్లి, దుబ్బగూడెం, సుద్దాల, కొమ్మెర, కోటపల్లి మండలంలోని పిన్నారం, ఎదుల్లబంధం, పంగిడి సోమారం, వెంచపల్లి, రాజారం గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కోటపల్లి మండలంలోని పిన్నారం గ్రామంలో ఇంటికి ఒకరు చొప్పున జ్వరపీడితులున్నారు. గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలను అదుపు చేయకుంటే ఆస్పత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితి నెలకొంటుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డెంగీ లక్షణాలున్నయట



జ్వరంతో రెండురోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన. డెంగీ లక్షణాలున్నట్లు వైద్యులు తెలిపారు. రక్త పరీక్షలు చేశారు. రిపోర్టులు రాలేదు. ఆస్పత్రి భవనం బాగున్నా నిర్వహణ సరిగా లేదు. బాత్‌రూమ్‌లలోని నీరు వార్డుల్లోకి వస్తోంది. అధికారులు స్పందించి ఆస్పత్రిని శుభ్రంగా ఉంచేలా చూడాలి.

– యశ్వంత్, శ్రీనగర్ కాలనీ, చెన్నూర్

మా అమ్మను తీసుకువచ్చిన



మూడురోజులుగా మా అమ్మకు జ్వరం వస్తున్నది. జ్వరంతో పాటు శరీరమంతా నొప్పులున్నాయని బాధపడుతోంది. వైద్యులు చికిత్స చేస్తున్నరు. ఒళ్లు నొప్పులుంటే చికున్ గున్యా లక్షణాలంటున్నరు. వైద్యులు రిపోర్టులు ఇస్తే తెలుస్తుంది. వార్డులను పరిశుభ్రంగా ఉంచాలె.

– అరవింద్, కొత్తగూడెం కాలనీ, చెన్నూర్

'రాపోలు'కు ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్‌రావు

మంచిర్యాలఅర్బన్: యూనివర్సిల్ మెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న మంచిర్యాల రివిలేషన్ ప్రిన్సిపాల్ రాపోలు విష్ణువర్ధన్ రావుకు ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్–2024 అవార్డును ప్రకటించారు. హైదరాబాద్‌లో దిపార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ముఖ్య అతిథి ఓమ్‌టెక్ సీఈవో శేఖర్ జైన్, యూనివర్సిల్ మెంటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సందీప్ గులాటి చేతుల మీదుగా రాపోలు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ ఉన్నారు.

నిర్మల్ కవులకు పురస్కారాలు


పోలీస్ భీమేశ్


తుమ్మల దేవరావు


తొడిశెట్టి పరమేశ్వర్


నేరెళ్ల హనుమంతు

నిర్మల్‌ఖిల్లా: తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితా మహుడు, ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఏటా ఇచ్చే గిడుగు జాతీయ సాహితీ కళా, సేవారంగాల పురస్కారాలను నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు కవులు దక్కించుకున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన పోలీస్ భీమేశ్‌కు 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటికి, తుమ్మల దేవరావుకు 'మట్టి పాదాలు' కవితా గ్రంథానికి వేర్వేరుగా 'గిడుగు జాతీయ సాహితీ పురస్కారం' దక్కింది. సాహితీ, కళా, సేవారంగాల్లో చేస్తున్న సేవలకుగాను తొడిశెట్టి పరమేశ్వర్‌కు, సేవారంగంలో అందిస్తున్న సేవలకు గాను నేరెళ్ల హనుమంతుకు 'గిడుగు జాతీయ సాహితీ సేవారంగ పురస్కారా'లు లభించాయి. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్తగా నిర్వహించనున్న జాతీయ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 29న ఉంటుందని పురస్కార గ్రహీతలకు సమాచారమందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన గిడుగు పురస్కారాలకు నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు ఏకకాలంలో ఎంపిక కావడంపై జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, రచయితలు అభినందనలు తెలిపారు.

సంతానం కావడంలేదని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: సంతానం కలగడంలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సునీల్, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన చహకటి జంగుబాపు (30)కు పదేళ్ల క్రితం ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన సీతాబాయితో వివాహమైంది. సంతానం కలగపోవడంతో పలు ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో నాలుగు నెలలుగా జంగుబాపు మద్యానికి బానిస కాగా, భార్య సీతాబాయి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తాగిన మైకంలో వ్యవసాయ చేనుకు వెళ్లి జంగుబాపు పురుగుల మందు తాగాడు. సమీప రైతులు, కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న జగ్గెరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మరణం తట్టుకోలేక తనయుడి మృతి

నిర్మల్‌టౌన్: తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు మృతి చెందాడు. వివరాలు.. నిర్మల్ పట్టణంలోని ఆస్ర కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి జాహూర్ అలీఖాన్ (74) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మరణించాడు. తండ్రి మరణించిన విషయాన్ని కుమారుడు అబిద్ అలీఖాన్(50) బంధువులు, మిత్రులకు సమాచారం అందించాడు. ఈ క్రమంలో అతను ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. అబిద్ అలీఖాన్ టింబర్ డిపో నడుపుతున్నాడు. ఒకే రోజు తండ్రి, కొడుకు మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

అనాథ పిల్లలను ఆదుకుంటాం


పిల్లల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు


చిన్నారికి పాలు తాగిస్తున్న ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి: తల్లిని కోల్పోయి అనాథలైన కవల పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అందునాయక్‌తండాలో శనివారం కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారులు ఆదివారం అందునాయక్ తండాను సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పిల్లలను కేంద్రానికి అప్పగిస్తే అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తన భార్య దీక్ష కర్మకాండల వరకు ఉంచి ఆ తర్వాత కేంద్రానికి అందజేస్తానని, అప్పటివరకు తమ పిల్లల బాగోగులు తామే చూసుకుంటామని అధికారులకు తండ్రి గోవింద్ లేఖ రాసిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తల్లి, దండ్రులను కోల్పోయి అనాథలైన ప్రతీ చిన్నారిని ఆదుకోవడానికి బాలల సంరక్షణ కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్ ఉన్నారు.

చిన్నారులను ఆదుకుంటాం

అందునాయక్‌తండాలో బాలింత మృతితో తల్లిని కోల్పోయిన చిన్నారులను ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు. ఆదివారం ఆమె గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన బాలింత కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పిల్లల చదువులకు భరోసా కల్పించారు. నాయకులు సునీల్‌జాదవ్, సోమోరే నాగోరావ్, విశాల్, రాజు, కాంబ్లే అతిశ్, అమోల్ తదితరులున్నారు.

బాసరలో భక్తుల రద్దీ

బాసర: ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడంతో నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం ఆదివారం తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులతో అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచార్యుడు ప్రవీణ్ పాఠక్ భక్తులకు అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.


పిల్లలకు అక్షర శ్రీకారం చేయిస్తున్న తల్లిదండ్రులు